క్లుప్తంగా

అధికారుల నిర్లక్ష్యం

గండేపల్లి: మండల పరిధిలోని రామేశంపేట ఏడీబీ రోడ్డు విస్తీరణలో భాగంగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల నిర్మించిన డ్రైనేజీలపై స్లాబ్ వేస్తుండడంతో డ్రైనేజీలో మట్టి, బూడిద, పూడికను తొలగించకుండానే పనులు నిర్వహిస్తే వర్షనీరు, మురుగు నీరు పారే మార్గం మూసుకుపోతుందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణికి ఫిర్యాదు చేసినట్టు స్థానికులు గింజాల దుర్గాప్రసాద్, గుబ్బల శ్రీనివాస్, టీకిరెడ్డి రమణ, బమ్మిడి శివ, చేపల రాంబాబు, తదితరులు తెలిపారు. దీనిపై చర్యలు చేపట్టి డ్రైనేజీలు శుభ్రంపరిచే విధంగా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు జాగ్రత్తలు వహించాలి

ప్రత్తిపాడు రూరల్: మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యే శ్రద్ధ వహించాలని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మహిళల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.యశస్వి, మాలకొండయ్య, ఎస్ సింహాద్రిలు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా ముందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రద్ధ తీసుకోవాలి

ఏలేశ్వరం: మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచించారు. మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో సోమవారం మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అనేక రకాల పరీక్షలు చేశారు. వైద్యులు బి.రాంబాబునాయక్, పి కృష్ణప్రసాద్ మహిళలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, రొమ్ము, నోటి, గర్భశయ క్యాన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సుంకర సత్యనారాయణ, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి ఫ్యాన్ల బహూకరణ

గండేపల్లి: మండల పరిధిలోని జెడ్ రాగంపేట సీహెచ్‌సీకి జెడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ సోమవారం ఫ్యాన్లు బహుకరించారు. వైద్యులు, రోగుల సౌకర్యార్థం వీటిని సీహెచ్‌సీ సూపరింటెండ్ ప్రణీత్‌కి అందజేసినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, నేతలు జీను మణిబాబు, సీహెచ్‌సీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

కిర్లంపూడి: మహిళలకు ఆర్థికంగా వృద్ధిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపుపై అధికారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్ అన్నారు. ఏపీఎం ఎస్.దేవకుమారి అధ్యక్షతన స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జీఎస్టీ తగ్గుదలపై మహిళలకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ చార్జీలు తగ్గడం వల్ల ప్రతి ఒక్కరులోను కనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపు అల్పదాయ వర్గాలకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. సీసీలు ఎన్.బుల్లియ్య, లోవరాజు, మండల సమాఖ్య అధ్యక్షుడు పి.ఎస్తేరు రాణి, జి.సంధ్య, అకౌంటెంట్ సంధ్య, వీఓఏలు పాల్గొన్నారు.

రహదారుణం

- ఛిద్రమైన రోడ్లలో అవస్థలు
- నిత్యం ప్రమాదాలతో సహవాసం
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



భారీ గోతులతో రౌతులపూడి - కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారి

రౌతులపూడి: రౌతులపూడి–కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా ఛిద్రమవ్వటంతో ఈ మార్గంలో ప్రయాణమంటేనే ప్రజలు నరకయాతన పడుతున్నారు. సుమారు పద్దెనిమిది కిలోమీటర్లు ఉన్న రహదారిలో రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వందలాది భారీ క్వారీ లారీలు, లేటరైట్ తరలించే భారీ వాహనాలు ఈ మార్గం గుండా ప్రయాణించడం వలన అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలు వందలాదిగా రవాణా సాగిస్తుంటాయి. వాహనాలు తరచూ మరమ్మతులకు గురై ఆర్థికంగా నష్టపోతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. అసలే ఆర్టీసీలో ఆడవారికి ప్రయాణం ఉచితం చేయటంతో ఆటోలకు సరియైన కిరాయిలు లభించక ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే రహదారి ఛిద్రమై వాహనాలు తరచూ మరమ్మతులకు గురై తీవ్రనష్టాన్ని చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18 కి.మీ..గంటన్నర ప్రయాణం

సాధారణంగా పద్దెనిమిది కిలోమీటర్లు దూరం ప్రయాణించాలంటే 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతుంది. ప్రస్తుతం రహదారి మొత్తం పెద్ద గోతులతో చిన్నాభిన్నమవ్వటంతో రౌతులపూడి నుంచి కత్తిపూడికి ప్రయాణించాలంటే సుమారు గంటన్నర సమయం పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఆసుపత్రి, వివిధ ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు వంటి ముఖ్యమైన పనులపై నిర్ణీత సమయానికి చేరుకోలేక నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పదహారు నెలలు గడుస్తున్న నేటికి రహదారి నిర్మాణానికి ఎలాంటి పరిష్కార చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.70 లక్షలు వెచ్చించి

కూటమి ప్రభుత్వం ఇటీవల రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు రూ.70 లక్షలు వెచ్చించి అరకొరివిగా పనులు సాగించి మమ అనిపించారు. మరమ్మతులు చేపట్టిన నెల రోజులకే పూర్తిగా రహదారి మొత్తం గోతులు ఏర్పడ్డాయని సమీప ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గుర్తించి రౌతులపూడి–కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రహదారి నిర్మించండి

రౌతులపూడి–కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారిని వెంటనే నిర్మించాలి. పద్దెనిమిది కిలోమీటర్లు ఉన్న రహదారిలో ప్రయాణించాలంటే నిత్యం నానా అవస్థలు పడుతున్నాం. రహదారి నిర్మాణానికి శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేపట్టాలి.

– బొడ్డు రవికుమార్, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

ఆర్థికంగా నష్టపోతున్నాం

అసలే ఆదాయం అంతంత మాత్రంగా ఉండే తమకు ఈ రహదారిలో ప్రయాణించడం వలన ఆటోలు తరచూ మరమ్మతులు గురవుతుడడంతో ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నాం. వాహనదారులు ఇబ్బందులను గుర్తించి రహదారి నిర్మాణం చేపట్టాలి.

– అల్లం మల్లేష్, ఆటోడ్రైవర్, రౌతులపూడి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి గ్రామం సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. సోమవారం గ్రామంలో పంచాయతీ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత చేపట్టి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లి, దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బెండపూడిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ బెండపూడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

- ఏకగ్రీవంగా అజెండా ఆమోదం
- జీరో అవర్ రద్దు



అజెండాలో అంశాలను ఆమోదిస్తున్న చైర్‌పర్సన్ భువనసుందరి



కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

తుని రూరల్: సమస్యలు, అభివృద్ధిపై ఎటువంటి చర్చ లేకుండనే మున్సిపల్ సాధారణ సమావేశాన్ని సోమవారం సభ్యులు ముగించారు. అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధ్యక్షతన తుని మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలో 18 అంశాలను అధికారులు చదివి వినిపించగా సభ్యులు చర్చించకపోవడం, అభ్యంతరం చెప్పకపోవడంతో ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు చైర్‌పర్సన్ భువనసుందరి ప్రకటించారు. కొబ్బరితోట వీధిలో రూ.24 లక్షలతో నిర్మించనున్న స్టారమ్ వాటర్ డ్రైన్, వివిధ వార్డుల్లో మున్సిపల్ ఖాళీ స్థలాలు సంరక్షించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు, తదితర అంశాలను ఆమోదించారు. ఇతరేతర కార్యక్రమాలు ఉండడంతో జీరో అవర్ నిర్వహించలేదు. కమీషనర్ వెంకట్రావు, వైస్ చైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదికి సత్కారం

ద్రవిడ యునివర్సిటీకి చెందిన సీనియర్ న్యాయవాది పెంటపాటి నారాయణమూర్తి సోమవారం మున్సిపల్ పరిపాలనపై పరిశోధన పత్రాన్ని అందజేశారు. తుని మండలం కొలిమేరు గ్రామానికి చెందిన ఆయన పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ భువనసుందరి, వైస్‌చైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, కౌన్సిలర్లు, అధికారులు శాలువాతో ఆయనను సత్కరించారు.

ఈనాం భూములపై హక్కులు కల్పించాలి

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరు గ్రామంలోని ఈనాం భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సాగుదారులు సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన నిర్వహించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ చింతలూరు గ్రామంలో 1,450 ఎకరాల భూమిని ఈనాం భూమిగా ఆర్డీఓ డిక్లేర్ చేశారన్నారు. కొంతమంది వలస భూస్వాములు రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి సుమారు 6.76 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేశారని ఆయన ఆరోపించారు. సంబంధిత అధికారులు తక్షణం సమస్యను పరిష్కరించి, పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఏగుపాటి అర్జునరావు కోరారు. కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ గిరిజన సంఘ అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యానికి ఆటంకం



నల్ల రిబ్బన్లతో విధులకు హాజరైన వైద్యులు రాంబాబు నాయక్, సాయి హేమాంజలి

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఓపీ సేవలను నిలిపివేశారు. జీవో 99 ద్వారా తగ్గించిన ఇన్ సర్వీస్ పీజీ కోటాను తిరిగి ఇవ్వాలని, పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతుల కల్పించాలని, పలు డిమాండ్‌లను పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి నిరసనగా వైద్యులు నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం విధులకు హాజరయ్యారు. వైద్యులు ఓపీని చూడకపోవడంతో రోగులు చేసేది ఏమిలేక ఫార్మసిస్టుల వద్దనే మందులు తీసుకుని వెనుతిరుగుతున్నారు.

రోగుల అవస్థలు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వానికి నిరసనగా పీహెచ్‌సీ వైద్యులు వైద్యసేవలు నిలిపివేశారు. దీనిలో భాగంగా వైద్యులు నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం విధులకు హాజరయ్యారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించేందుకు వైద్యులు నిరాకరించడంతో చేసేది ఏమీ లేక మందులు తీసుకుని వెనుతిరుగుతున్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు రూరల్: తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.యశస్వీ కోరారు. మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ జీవో 99 ద్వారా తగ్గించిన ఇన్‌సర్వీస్ పీజీ కోటాను తిరిగి పునరుద్ధరించాలన్నారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే దశలవారీగా అత్యవసర సేవలను సైతం నిలిపివేస్తామన్నారు. మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, శాంతిఆశ్రమం పీహెచ్‌సీ వైద్యులు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ



గోకవరంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు గోకవరంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను నాయకులు సోమవారం ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాలతో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక సీనియర్ నాయకుడు దాసరి చినబాబు ఇంటి వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ పోస్టర్‌ని ఆవిష్కరించారు. పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు కోసం రూపొందించిన డిజిటల్ బుక్‌లో కూటమి పాలకుల చేతిలో అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరు ఈ బుక్‌లో ఫిర్యాదు చేసుకునే విధంగా ఈ డిజిటల్ బుక్‌ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ అధికారంలో వస్తే బుక్‌లో నమోదైన ఏ ఒక్క అధికారిని, కూటమి నాయకులను, కార్యకర్తలను వీడిచి పెట్టామని, కూటమి పాలకుల కాళ్లకు మడుగులు ఒత్తకుండా అధికారులు నిజాయితీగా పనిచేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లీ వీరబాబు, పార్టీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తోలేటి రాంప్రసాద్, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు బూలా అబ్బులు, సరాలశెట్టి నరసయ్య, జిల్లా వైస్సార్ సీపీ సెక్రెటరీ మడికి మైనర్ బాబు, అంబటి అబ్రహం, మండల వైసీపీ అధ్యక్షుడు బిజ్జి రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



పోతులూరులో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో సోమవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన ముప్పిడి చిన్న ఏసుబాబు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని మురళీకృష్ణంరాజు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



కిర్లంపూడి కన్యకా పరమేశ్వరీ ఆలయానికి పోటెత్తిన విద్యార్థులు, భక్తులు



తొలిపావంచా కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం



సరస్వతీ దేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ



సరస్వతీదేవిగా వరమహాలక్ష్మి



ఏలేశ్వరంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నారాయణస్వామి

ఏలేశ్వరం: శ్రీ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం దుర్గాదేవి అమ్మవారు చదువుల తల్లి సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. మూలనక్షత్రం కావడంతో అమ్మవారి సరస్వతిదేవిగా అలంకరించారు. దీంతో అమ్మవారు ప్రత్యేకతను సంతరించుకున్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేసి, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణ స్వామి ఆధ్వర్యంలో చిన్నారులకు నోట్‌పుస్తకాలను అందజేశారు. స్థానిక లారీయూనియన్ కార్యాలయం ఎదురుగా దుర్గాదేవి ఆలయం నుంచి మహిళలకు సారెతో ఊరేగింపు నిర్వహించారు.

గండేపల్లి: తాళ్లూరు విజయదుర్గ ఆలయంలో విజయ దశమి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని ఆమంచి ఆంజనేయ గురు స్వామి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సరస్వతి అవతారంలో కొలువుతీరిన అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు. తాపీమేస్త్రీల సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. విజయ దశమిని పురస్కరించుకుని ఆలయంలో ముప్పిగూడల అచ్యుతాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేవి శరన్నవరాత్రి సందర్భంగా తాళ్లూరులో బాలాత్రిపుర సందరి అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. చిన్నారులు విద్యాబుద్ధులు అలవరుచుకోవాలని పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

గోకవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రునిగద్దెలో, గట్టుమీద దుర్గమ్మ ఆలయం వద్ద, తంటికొండలో శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద చిన్నారులతో సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. ఈ పూజాకార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని చిట్టూరు మెట్రోలో వేంచేసియున్న శ్రీ వైకుంఠ నారాయణ సహిత వరమహాలక్ష్మి అమ్మవారు మూలనక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా వరమహాలక్ష్మీ అమ్మవారికి విశేష చదువుల తల్లి సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారికి కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా చండీ హోమం

తొండంగి(అన్నవరం): రత్నగిరి కొండదిగువ తొలిపావంచా కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం ఘనంగా జరిగింది. దసర శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారికి దేవస్థాన వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయ ప్రాంగణంలో రుత్వికులు హోమం నిర్వహించారు. దేవాలయ అధికారులు, భక్తులు పూర్ణాహుతి కార్యక్రమంలో హోమద్రవ్యాలు వేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ, జగపతినగరంలోని అభయదుర్గమ్మ, రామచంద్రపురంలోని కనక దుర్గమ్మ సర్వస్వతి దేవి అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భారీ ఎత్తున విద్యార్థులకు నోట్స్ బుక్‌లు, పెన్సిల్ కిట్టులను అందజేశారు.

కోటనందూరు: దసర శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా మండలంలోని కేఈ చిన్నాయపాలెం దుర్గాపరమేశ్వరీ అమ్మవారిని సోమవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జి ఆధ్వర్యంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. పరిసర గ్రామాల నుంచి అమ్మవారిని ప్రజలు దర్శించుకుని పూజలు చేశారు.

సరస్వతీదేవి అలంకరణలో నేరేళ్లమ్మ

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రధానాలయంలో ఆలయఅర్చకులు పేర్రాజు నిత్యపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసామని ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసియున్న కనక దుర్గ అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేకువ జామునుంచి అమ్మవారి భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు బానుభాబు తదితరులు వేధమంత్రోచ్ఛరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ (శ్రీనివాసావర్తక సంఘం) నిర్వాహుకులు భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని గండేపల్లిలో మహర్షి జ్యోతి షాలయంలో అమ్మవారి పీఠంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని దేవి ఉపాసకులు, వేదపండితులు బ్రహ్మశ్రీ దువ్వూరి శేషగిరి శాస్త్రి సిద్ధాంతి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సరస్వతీ పూజలు, హోమాలు జరిపారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

వైభవంగా బోనాల పండుగ

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా సోమవారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకుని, గ్రామ ప్రదర్శన నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తుల భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాధికారులు స్వాగతం పలికారు.



తాళ్లూరులో విజయదుర్గ ఆలయంలో గురుస్వామి ఆధ్వర్యంలో మహిళాల పూజలు



గండేపల్లిలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు